సాక్షి
సిద్దిపేట
బుధవారం । 4 । డిసెంబర్ । 2024



వర్షానికి తడిచిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

## అల్పపీడనం



తడిచిన ధాన్యం చూపుతున్న మహిళ

అల్పపీడన ప్రభావంతో సిద్దిపేట పట్టణంలో సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. మార్కెట్ యార్డులో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. తడవడం వల్ల మొలకలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేసేది లేక మరోసారి ఆరబెట్టు కుంటున్నారు. సాయంత్రం ఇంకోసారి మబ్బులు పట్టడంతో టార్పాలిన్‌లు ఉత్పత్తులపై కప్పారు.

-సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

## న్యూస్‌రీల్

### మల్లన్న ఆలయ కమిటీ నియామకం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కమిటీ సభ్యులుగా చిగిరి కొమురయ్య, కాయిత మోహన్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, వల్లాద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మి, నేరెపల్లి మచ్చేందర్‌రెడ్డి, కొప్పూరవు జయప్రకాశ్‌రెడ్డితో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధానార్చకుడు మల్లికార్జున్‌ను నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీలో 14 సభ్యులకుగాను ఎనిమిది మందిని మాత్రమే నియమించారు. మిగతా వారికోసం మరో నోటిఫికేషన్ విడుదలచేసి 20 రోజులలో భర్తీ చేయనుంది. నియమించిన వారిలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి విధేయులుగా ఉన్నవారు చైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉందని సమాచారం.

### రాజీమార్గంతోనే ప్రయోజనం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి**

సిద్దిపేటకమాన్: డిసెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో రాజీపడేటట్లు చూడాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని సిద్దిపేట బార్ అసోసియేషన్‌లో న్యాయ సేవాధికర సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులతో మంగళవారం న్యాయమూర్తి సమావేశం నిర్వహించారు. జిల్లాలో అధిక మొత్తంలో కేసులు రాజీపడేట్లు చూడాలని న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతి రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు దేవునూరి రవీందర్, రాజలింగం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

### 'స్థానిక'ంలో సత్తా చాటాలి

**పీసీసీ సభ్యురాలు పారిజాతం**

గజ్వేల్: ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందని పీసీసీ సభ్యురాలు, ఇందిరమ్మ కమిటీల కోఆర్డినేటర్ పారిజాతం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కమిటీలకు నిర్వహించిన సన్మానంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని కొనియాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు రాబోతున్నాయని, అవసరమైతే మరిన్ని గృహాలు కావాలని సీఎంను కోరతామని చెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిందే



మాట్లాడుతున్న పర్వతాలు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవు అన్నారు. మంగళవారం కార్యకర్తలతో కలిసి ఆయన మండల కేంద్రంలోని కేజీవీబీని పరిశీలించారు. అనేక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సరిపడా దుప్పట్లు, దుస్తులను అందించలేదని మండిపడ్డారు. ఇటీవల ఫుడ్‌పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఏర్పుల మహేశ్, మాజీ జెడ్పీటీసీ సిద్దప్ప, నాయకులు తలారి కిషన్, సాగర్, విరాట్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు రుణాలతో ఆర్థిక అభివృద్ధి

**మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి**

దుబ్బాక: మహిళ సంఘాలు, వీధి వ్యాపారులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత భూంరెడ్డి కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు స్వెట్టర్లు, మంకీ క్యాపులతో పాటుసేఫ్టీ కిట్స్‌ను అందించారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. మహిళా సంఘాలు, వ్యాపారులకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు.

# కలవని చేతులు

కాంగ్రెస్‌లో వర్గపోరు కొనసాగుతోంది. పార్టీ కార్యక్రమాలు కూడా వర్గాలవారీగా చేపడుతున్నారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో నేతల తీరే అందుకు అద్దం పడుతోంది. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలో ఉన్నాగానీ గ్రూప్ రాజకీయాలకు మాత్రం తెరపడటం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి ఉన్నా.. గ్రూపుల గోలను చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు చేయడం లేదని పార్టీ శ్రేణులు విమర్శిస్తున్నాయి.

- జిల్లా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వర్గపోరు
- పార్టీ కార్యక్రమాలు కూడా వేర్వేరుగా నిర్వహణ
- మంత్రులు, ప్రముఖ నేతలు వచ్చినప్పుడు కూడా అదే తీరు
- సిద్దిపేటలో ఎవరికి వారే యమునా తీరే
- అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి, సిద్దిపేట: గ్రూప్‌లు రాజకీయాలు వద్దు.. ఐకమత్యంగా ముందుకు సాగాలని కాంగ్రెస్ అధిష్టానం ఎప్పటి నుంచో చెబుతోంది. అయినా జిల్లా కాంగ్రెస్‌లో గ్రూప్‌లు కొనసాగుతున్నాయి. ఈనెల 2న జిల్లాలోని బండ తిమ్మాపూర్ నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఓ వర్గం నేతలను లోపలికి సీఎంను కలిసేందుకు పంపించారని, తమ వర్గంను లోపలికి వెళ్లనివ్వలేదని నర్సారెడ్డి వర్గీయులు ఆందోళన చేపట్టారు. కానీ వర్గపోరు సమసేలా మాత్రం ఎవరూ యత్నించడం లేదని కార్యకర్తలు కోరుతున్నారు.

**నర్సారెడ్డి వర్సెస్ బండారు**

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావుల మధ్య వర్గపోరు రోజురోజుకు పెరిగిపోతోంది. కాంగ్రెస్ పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు వేర్వేరుగానే నిర్వహిస్తున్నారు. గజ్వేల్‌కు మంత్రులు, పీసీసీ నాయకులు వస్తే వారిని వేర్వేరుగానే స్వాగతం పలుకుతున్నారు.

**వర్గాలు ఎక్కువే..**

సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్‌లో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, రాష్ట్ర చేనేత సెల్ అధ్యక్షుడు గుడూరు శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్‌లు ఎవరి వర్గం వారు కొనసాగిస్తున్నారు. గతంలో ఒకరిపై ఒకరు పీసీసీకి సైతం ఫిర్యాదులు చేసుకున్నారు. బహిరంగంగా విమర్శలు సైతం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పలుమార్లు సిద్దిపేటలో కార్యక్రమాలలో పాల్గొంటున్నారే తప్ప అందరినీ ఒకతాటి పైకి తీసుకురావడం లేదు.

### దుబ్బాకలో రెండు వర్గాలు

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్‌కుమార్ రెడ్డిల మధ్య వర్గ విభేదాలు కొన్నేళ్లుగా కొనసాగున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జి హోదాలో శ్రీనివాస్ నిర్వహించే కార్యక్రమాల్లో శ్రావణ్ వర్గం పాల్గొనడం లేదు. నియోజకవర్గంలో మంత్రుల పర్యటన సందర్భంగా ఈయన వర్గంకు సమాచారం ఇవ్వడం లేదని పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు.



### కట్టడి అయ్యేదెప్పుడు?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా గ్రూప్‌లకు చెక్ పెట్టడం లేదు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లతో పాటు ఇన్‌చార్జి మంత్రి కొండ సురేఖలు అందరినీ ఒక్కతాటి పైకి తీసుకు రావడం లేదని కార్యకర్తలు విమర్శిస్తున్నారు. సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన పార్టీని బలోపేతం చేయాల్సింది పోయి వర్గాలు విడిపోవడంతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. ఇలా వర్గాలుగా విడిపోవడంతో కొత్తగా పార్టీలో చేరాలనుకునే వారు సైతం వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలను ప్రజలల్లో తీసుకు వెళ్లి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు.

# రైతులకు న్యాయం చేస్తాం

**కలెక్టర్ మనుచౌదరి**



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: రీజినల్ రింగు రోడ్డు నిర్మాణంలో భాగంగా వ్యవసాయమే బతుకుదెరువుగా జీవనం సాగిస్తున్న రైతులు భూములు ఇచ్చేందుకు సుముఖంగా ఉండడంతో ఎంతో శుభపరిణామమని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. మంగళవారం జిల్లాలో రీజినల్ రింగ్ రోడ్డుతో భూములు కోల్పోతున్న ఆయా గ్రామాల రైతులతో కలిసి ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజినల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ప్రాంత అభివృద్ధికి రైతులు భూములు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నారన్నారు. గ్రామాల్లో భూమి విలువను రైతులు తెలిపిన విధంగా నోట్ చేసుకుని రాష్ట్ర ఉన్నతాధికారులకు అందించి అందరికీ న్యాయం చేసేలా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ల్యాండ్ పూలింగ్ గురించి అధికారులతో కలిసి తాను చర్చిస్తానన్నారు. అంతకుముందు రైతులు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా నష్టపరిహారం అందించాలని, లేనిపక్షంలో ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా రోడ్డు వెంబడి కొంత మేర స్థలం ఇప్పించాలని రైతులు కోరారు.

# కశ్మీర్‌కు జాతీయ ఫుట్ బాల్ జట్టు



బాలికల జట్టుతో కోచ్ నర్సింహులు తదితరులు

గజ్వేల్‌రూరల్: కోచ్ రాంగారి నర్సింహులు సారథ్యంలో అండర్–17 బాలికల విభాగంలో 68వ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు మంగళవారం జమ్మూ –కశ్మీర్‌కు జట్టు పయనమైంది. ఈనెల 6 నుంచి 10 వరకు క్రీడలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడారు. బాలికల జట్టులో మొత్తం 18 మంది క్రీడాకారిణులున్నారన్నారు. మేనేజర్‌తో కలిసి పోటీలకు బయలుదేరుతున్నామన్నారు. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో జరిగే ఈ ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ తరపున సత్తా చాటుతామనే ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించిందన్నారు. రాష్ట్రానికి పేరు తీసుకురావాలని క్రీడాభిమానులు కోరారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జేడీ శ్రీధర్**



పట్టణంలో నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీ

హుస్నాబాద్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలు, అర్బన్ డే సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో కళాకారుల సాంస్కృతి కార్యక్రమాలు, ఉత్తమ కార్మికులకు సన్మానం, పారిశుద్ధ కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. తుది దశ తెలంగాణ ఉద్యమకారుడు శ్రీకాంత్ చారి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. అనంతరం స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు రూ. కోటి బ్యాంక్ లింకేజీ చెక్కును అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీధర్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత మాట్లాడారు. హుస్నాబాద్‌ను స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మూడు సార్లు జాతీయ అవార్డు సాధించడంలో ప్రజలు, పారిశుద్ధ్య కార్మికుల కృషి ఉందన్నారు. మహిళలు బ్యాంక్‌ల ద్వారా పొందుతున్న రుణాలతో వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంభన కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే కఠినచర్యలు

**జిల్లా వ్యవసాయాధికారి రాధిక**

మర్కూక్(గజ్వేల్): ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని, నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక హెచ్చరించారు. మంగళవారం మండలంలోని వరదరాజ్‌పూర్, గణేష్‌పల్లి గ్రామాల్లో విత్తన షాపులపై దాడులను నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన ధరల పట్టికలు, రికార్డులను పరిశీలించారు. దుకాణాల వద్ద రైతులకు కనిపించేలా స్టాక్ బోర్డు, ధరల పట్టికలను ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులను అందజేయాలన్నారు.

### స్నిఫర్ డాగ్స్ తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి, బేగంపేట గ్రామాల్లో బెజ్జంకి పోలీసులు మంగళవారం స్నిఫర్ డాగ్స్‌తో ముమ్మర తనిఖీ చేపట్టారు. గంజాయి, గుట్కా, మత్తుపదార్థాల ఆచూకీ కోసం కిరాణా, పాన్‌షాప్‌లతో పాటు అనుమానిత స్థలాల్లోను తనిఖీ నిర్వహించారు.



కిరాణా దుకాణంలో డాగ్స్‌తో తనిఖీ చేస్తున్నపోలీసులు

# అవగాహనతోనే మహమ్మారి దూరం





అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నర్సింగ్ విద్యార్థులు

- ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం
- బాధితుల పట్ల ప్రేమ చూపాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్
- పట్టణంలో అవగాహన ర్యాలీ

సిద్దిపేటకమాన్: ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన అవగాహనతోనే సాధ్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్ కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద అవగాహన ర్యాలీని మంగళవారం ఆయన జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థినులు.. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమన్నారు. బాధితుల పట్ల ప్రేమ చూపాలన్నారు. ఈ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి నిర్మూలనలో ఆరోగ్య సిబ్బందితో పాటు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే ప్రణాళికలు వేసుకోవాలన్నారు. అందుకు తగ్గ కష్టం పడాల్సి వస్తుందని సూచించారు. అప్పుడే అనుకున్న స్థాయికి చేరుకుంటారన్నారు. విధంగా ముందుగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో సేవలందించిన ఉద్యోగులకు, ఆరోగ్య సిబ్బందికి, వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నర్సింగ్ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, సైకియాట్రి విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి, ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రావణి, వైద్యాధికారులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రుణపాశం

- వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

**వేర్లేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హుస్నాబాద్‌లో వ్యవసాయ కూలీ, సిద్దిపేటలో ఎలక్ట్రీషియన్, దుబ్బాకలో వృద్ధుడు చనిపోయాడు.**



బొల్లి రవి మృతదేహం

హుస్నాబాద్‌రూరల్: అప్పుల బాధతో వ్యవసాయ కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొల్లి రవి(45)కి మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా సాగు నీటి సౌకర్యం లేదు. వర్షాధార పంటలను సాగు చేసుకునే రవి భార్య రజిత అనారోగ్యం బారినపడటంతో వైద్య ఖర్చులకు అప్పులు చేశాడు. కుటుంబ పోషణ కోసం నిత్యం కరీంనగర్‌కు వెళ్లి మార్కెట్‌లో మూటలు మోసి ఉపాధి పొందుతున్నాడు. కూలి పనులు చేసినా అప్పులు తీరకపోవడంతో జీవితం పై విరక్తి చెంది వ్యవసాయ భూమి వద్దే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య రజిత, కుమారుడు, కూతురు ఉన్నారు.

**ఎలక్ట్రీషియన్..**

సిద్దిపేటకమాన్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సీఐ వాసుదేవరావు కథనం మేరకు.. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన మోతుకు శంకర్ (30) కొంత కాలంగా ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ పోషణ భారంతో అప్పుల బాధ భరించలేక ఇంట్లో సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు మధు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

**భవన నిర్మాణ కార్మికుడు..**

దుబ్బాకటౌన్: అప్పుల బాధతో ఉరేసుకొని భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన బండి వెంకటి (65) భవన నిర్మాణ మేస్త్రీగా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. వెంకటి కుటుంబ అవసరాలకు, తన ఆరోగ్యంతోపాటు భార్య ఆరోగ్యం కోసం దాదాపు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక నిత్యం బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు దేవరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటి (ఫైల్)

# ప్రతిభకు వైకల్యం అడ్డుకాదు

**అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్**

సిద్దిపేటరూరల్: వైకల్యం శరీరానికి మాత్రమేనని దృఢమైన మనసు, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. వైకల్యం ఉందని ఎలాంటి అధైర్య పడకుండా దృఢమైన పట్టుదలతో మంచి లక్ష్యాలను సాధించాలన్నారు. దివ్యాంగులు కోరిన విధంగా యూడీఐడీ కార్డులు, సదరం ధ్రువపత్రాలు, ఆర్టీసీ బస్‌పాస్‌లు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద ప్రసంగించారు. అనంతరం జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. విశిష్ట సేవలు అందించిన 30 మందిని సన్మానించారు. కార్యక్రమంలో డీసీపీఓ రాము, అధికారులు పాల్గొన్నారు.

**ఆహార విషయంలో రాజీ పడొద్దు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో రాజీ ఉండకూడదని అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ గురుకులం సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో స్టోర్ రూంను, కూరగాయలు, నిత్యావసర వస్తువులను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ హమీద్

ములుగు(గజ్వేల్): ప్రత్యేక అవసరాల పిల్లల కోసం 10 మంది స్కూల్ అసిస్టెంట్లు, 29 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించామని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్ రంగనాథ్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ములుగు జెడ్పీ హైస్కూల్‌లో దివ్యాంగులకు పోటీలను నిర్వహించి బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ, స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. తొలుత విజేతలకు బహుమతులను ప్రదానోత్సవం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కమీషన్ పేరుతో మోసం

**రూ.1.75 లక్షలు పోగొట్టుకున్న ఉద్యోగి**

**పటాన్‌చెరు టౌన్‌:** కమీషన్ పేరుతో నగదు కాజేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూలై 15వ తేదీన నగదు ఇన్వెస్ట్ చేస్తే కమీషన్ ఇస్తామంటూ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. దీనికి స్పందించిన ఉద్యోగి పలు దఫాలుగా అపరిచిత వ్యక్తికి రూ.1.75 లక్షలు వేశాడు. ఇంకా నగదు వేయాలని అపరిచిత వ్యకి పదే పదే అడగడంతో అనుమానం వచ్చిన ఉద్యోగి తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడిగాడు. దీంతో అతడు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

### కుర్‌కురే ప్యాకెట్లు సీజ్



సీజ్ చేసిన వాటిని చూపుతున్న అధికారులు

**మనోహరాబాద్(తూప్రాన్):** తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాలతో ఫుడ్ టాస్క్ ఫోర్స్ అధికారులు మండలంలోని కాళ్లకల్ పరిశ్రమల వాడలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ అధికారి, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో కాళ్లకల్‌లోని సన్ని ఫుడ్స్ మాన్యుఫాక్చర్ యూనిట్‌లో ఈ తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా నాణ్యత లేని కుర్‌కురే ప్యాకెట్లు, మసాల ప్యాకెట్లు తయారీని గుర్తించారు. లైసెన్స్ లేకుండా తయారీ చేయడం, స్టోరేజ్, విక్రయ యూనిట్‌లను నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో ప్యాక్ చేసిన వాటిని సీజ్ చేసి, నోటీసులను అందించామని, వాటి విలువ రూ. 2,13,250 ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన ఆహార నమూనాలను పరీక్షల ని మిత్తం ప్రయోగశాలకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, శ్రీశిశికల ఉన్నారు.

### యువతి అదృశ్యం



**వర్గల్(గజ్వేల్):** మండలంలోని నాచారంలో ఓ యువతి అదృశ్యమైంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం.. భవానందపూర్‌కు చెందిన పూస భూములు కూతురు సుప్రియ నాచారంలోని తమ దగ్గరి బంధువులైన శీలం నర్సింహులు ఇంటికి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో సుప్రియ అక్కడి నుంచి వెల్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ దొరకకపోవడంతో యువతి తండ్రి భూములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మృతురాలి ఆచూకీ లభ్యం

**హత్నూర (సంగారెడ్డి):** హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో 1వ తేదీన దారుణ హత్యకు గురైన మహిళ ఆచూకీ లభ్యమైంది. హత్నూర ఎస్సై సుభాష్ మంగళవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేపట్టగా మృతురాలు పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన గొల్ల లలిత (50) భర్త లింగమయ్యగా గుర్తించాం. మృతురాలు ఇంటి నుంచి బయలుదేరి సంగారెడ్డి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు తెలిసిందని, హత్యకు గల కారణాలను తెలుసుకొని నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్తి తగాదాలే కారణం అన్నట్లుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



# గట్టు.. మిగిలితే ఒట్టు

**మాయమైపోతున్న గౌరవెల్లి ప్రాజెక్ట్ కాల్వ గట్టు**

- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత
- నిత్యం టిప్పర్లలో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి
- కాల్వ హద్దులు తొలగడంతో అక్రమణకు గురవుతున్న భూమి
- పట్టించుకోని పలు శాఖల అధికారులు



రాంచంద్రపూర్ శివారులో నేలకు సమాంతరంగా కాల్వ గట్టు

గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ గట్టు రోజురోజుకూ తరిగిపోతోంది. కాల్వ తవ్వకం జరిగినప్పుడు ఇరువైపులా మట్టి గుట్టలను తలపించేది. కానీ నేడు నేలకు సమాంతరంగా అయ్యింది. గోరంత అనుమతి తీసుకొని కొండంత తవ్వేస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పేరుతో వందలాది టిప్పర్లలో మట్టిని తరలించేస్తున్నారు. ప్రాజెక్టు కెనాల్ తవ్వకం ప్రారంభం నాటి నుంచి ఈ మట్టి అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వం మారిన, మనుషులు మారిన మట్టి తవ్వకాలు ఏ మాత్రం ఆగడం లేదు. అధికారులు సైతం చూసిచూడనట్లుగా ఉండటంతో కాల్వ గట్టు కనుమరుగవుతూ వస్తోంది.

– కోహెడరూరల్(హుస్నాబాద్)

బెజ్జంకి మండలం తోటపల్లి చెరువు నుంచి హుస్నాబాద్ గౌరవెల్లి ప్రాజెక్టుకి నీటిని మళ్లించేందుకు కోహెడ మండలం రాంచంద్రపూర్, చిగురుమామిడి మండలం ఓగులాపూర్ మీదుగా సుమారు 8 కిలో మీటర్ల మేర కాల్వను తీశారు. తవ్వాకల్లో వచ్చిన మట్టిని కాల్వకు రెండు వైపులా 50 అడుగుల ఎత్తులో పోశారు. ఈ మట్టిపై కన్ను పడ్డ అక్రమార్కులు, కాంట్రాక్టర్లు ఇష్టారీతిన తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తున్నారు.

#### రోడ్డు విస్తరణ పేరుతో..

కెనాల్‌కు ఇరువైపులా ఉన్న మట్టితో ప్రభుత్వానికి భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారుల లోపంతో గండి పడుతుంది. ఇరిగేషన్ అధికారులు ఇష్టారాజ్యాంగ అనుమతులు ఇవ్వడంతో కాల్వ చుట్టూ ఎత్తైన గుట్టలుగా ఉన్న మట్టి సంగానికి పైగా మాయం అయ్యింది. ఇటీవల కోహెడ మండలంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ నిర్మాణ పనులకు ఇక్కడి నుంచే మట్టి తీసుకెళ్లడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో తీసుకున్న దానికంటే అధికంగా మట్టిని తవ్వి హద్దులు లేకుండా చేస్తున్నారు.

#### అనుమతి లేకుంటే చర్యలు

గౌరవెల్లి ప్రాజెక్ట్ కెనాల్ కాల్వకు సంబంధించిన మట్టిని రోడ్డు విస్తరణకు తరలించేందుకు 15 రోజులు మాత్రమే అనుమతి ఇచ్చాం అంతకు మించి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అలాగే, కెనాల్ వెంట హద్దులు ఏర్పాటు చేయలేదు. ఇందుకోసం ప్రభుత్వానికి నివేదించాం. అనుమతి రాగానే ఏర్పాటు చేస్తాం. కెనాల్‌కి సంబంధించిన భూమిని చుట్టుపక్కల రైతులు ఆక్రమించొద్దు.

– అజీజ్, ఇరిగేషన్ జేఈ

#### అనుమతులు ఉన్నాయంటూ..

కెనాల్ నుంచి తవ్విన మట్టిని మరో ప్రాంతానికి తరలించాలంటే కచ్చితంగా ఇరిగేషన్, మైనింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి. వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ నుంచి 15 రోజులకు గాను 5 వేల క్యూబిక్ సెక్‌ల అనుమతులు పొందారు. కానీ మైనింగ్‌శాఖ నుంచి అనుమతులు పొందకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. ఇదేంటని స్థానికులు ప్రశ్నిస్తే మాకు అనుమతులు ఉన్నాయంటూ తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో ఈ దందాకు పాల్పడుతున్నట్లు పలువురు చెబుతున్నారు.



మట్టిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనాలు

#### మాదంటే మాది కాదు

నిబంధనల ప్రకారం ఈ కెనాల్ మట్టిని తరలించాలంటే రెవెన్యూ, మైనింగ్ అధికారులకు, ఇరిగేషన్ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ ఇది కెనాల్ మట్టి కాబట్టి ఇరిగేషన్ శాఖ అధీనంలో ఉండటంతో పరివేక్షణ లోపంతో అక్రమార్కులకు వరంలా మారింది. మట్టి తరలింపుపై ఫిర్యాదు చేసినా ఆయా శాఖల నుంచి ఎలాంటి స్పందన లేకపోగా మా పరిధిలోకి రాదంటూ దాటవేస్తున్నారు. ఏది ఏమైనా అధికారుల సమన్వయ లోపంతో రూ.లక్షలు విలువ చేసే మట్టిని పక్కదారి పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకొని మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రించాలని కోరుతున్నారు.

### ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయకపోతే ఆందోళన

**మండల అఖిల పక్ష నేతల డిమాండ్**

**బెజ్జంకి(సిద్దిపేట):** మండలంలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని అఖిలపక్ష నాయకులు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, రాజులు డిమాండ్ చేశా రు. బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేసిన విధంగానే ఇదికూడా రద్దు చేయాలన్నారు. ఫ్యాక్టరీ వస్తే ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజు, రూపేశ్, మధు, సాయికృష్ణ, లింగం తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులపై ఆప్యాయత అవసరం: ఎంఈఓ సత్తయ్య

**కొండపాక(గజ్వేల్):** దివ్యాంగులను శాపగ్రస్తులుగా చూడవద్దని, వారిపై ఆప్యాయంగా ఉండాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి హైస్కూల్లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తుందని, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోందన్నారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రశాంత్, ప్రియాంక చోప్రా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రతీ రైతు సేంద్రియ సాగు చేయాలి

- కేవీకే శాస్త్రవేత్త దత్తాత్రేయ నల్కర్
- రైతులకు వరి విత్తనాలు, నారు మడులు పంపిణీ



కేవీకేలో రైతులకు వేప నూనె పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

**కౌడిపల్లి(నర్సాపూర్):** ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంబాజీ దత్తాత్రేయ నల్కర్ సూచించారు. మంగళవారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డీ.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ఇన్‌చార్జి, ఉద్యానవన శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోతిరెడిపల్లి గ్రామ ఎస్సీ రైతులకు 20 కిలోల వరి విత్తనాలు, జీవన ఎరువులు, వేపనూనె, టమాట, మిరప కూరగాయల నారు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ నల్కర్ మాట్లాడుతూ.. ప్రతీ రైతు కనీసం ఇంటి అవసరాల కోసమైనా సేంద్రియ సాగు చేయాలని సూచించారు. ఎస్సీ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేవీకే ఆధ్వర్యంలో సేంద్రియ, పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్, భార్గవి, వినాయక సేంద్రియ సహకారం సంఘం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## బిల్లులు ఇస్తారా? ఆత్మహత్య చేసుకోమంటారా?

**బాలికల పాఠశాలకు తాళం వేసిన ఎస్ఎంసీ చైర్మన్లు**

**మెదక్ మున్సిపాలిటీ:** అప్పులు చేసి పాఠశాలల నిర్మాణాలు చేస్తే బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తుందని, బిల్లులు మంజూరు చేయకుంటే మాకు ఆత్మహత్యే గతని ఎస్ఎంసీ చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మన ఊరు–మనబడి బిల్లుల కోసం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు తాళం వేసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఊరు–మన బడి పథకంలో పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని మండి పడ్డారు. వందలసార్లు కలెక్టర్లకు, డీఈఓకు వినతులు అందజేసినప్పటికీ బిల్లులు మాత్రం మంజూరు చేయడం లేదన్నారు. మేము నిర్మించిన పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో రంగులు వేయించి వారికి డబ్బులు ఇస్తున్నారని వాపోయారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి నిర్మాణాలు చేస్తే మాకు బిల్లులు ఇవ్వకుండా క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళం వేయడంతో విద్యార్థులంతా రోడ్డుపైన నిలబడిపోయారు. పాఠశాల హెచ్ఎం రేఖ విషయాన్ని ఎంఈఓ నీలకంఠం తెలుపగా అక్కడికి చేరుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని వారిని సముదాయించి ధర్నా విరమింపజేశారు. అనంతరం పాఠశాలకు తాళం తీశారు.



ధర్నా చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్లు

### జనవరి 11న బాడీ బిల్డింగ్ పోటీలు

**సిద్దిపేటజోన్:** జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 11న జిల్లా కేంద్రంలో బాడీ బిల్డింగ్ పోటీలు, ఎంపికలు ఉంటాయని అసోసియేషన్ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక విపంచి ఆడిటోరియంలో వచ్చే ఏడాది జనవరి 11 (శనివారం)న సాయంత్రం 6 గంటలకు బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించి మిస్టర్ సిద్దిపేట కోసం ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. 50 నుంచి 55 కిలోలు, 55 నుంచి 60, 60 నుంచి 65, 65 నుంచి 70, అదే విధంగా 80 నుంచి 85 కిలోల బరువు కేటగిరీలుగా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ఉంటాయని, అనంతరం మిస్టర్ సిద్దిపేట ట్రోఫీ గెలిచిన వారికి నగదు పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్ స్వామి, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యం గౌడ్, సిద్ధులు, శేఖర్, సౌఖత్, అఫ్సర్, తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న రైల్వే లైన్ విద్యుద్దీకరణ పనులు

**రైల్వే డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్**



అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో లోకేష్ విష్ణోయ్

**రామాయంపేట(మెదక్):** మండల పరిధిలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్‌ను మంగళవారం దక్షిణ మధ్య రైల్వే డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్ పరిశీలించారు. స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ నుంచి ముత్కేడ్ వరకు 221 కిలో మీటర్ల మేర రైల్వే లైను విద్యుద్దీకరణకు రూ.2,300 కోట్లు మంజూరయ్యాయన్నారు. పనులు కొనసాగుతున్నాయని తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అక్కన్నపేట–మెదక్, మనోహరాబాద్– కొత్తపల్లి లైనులో విద్యుద్దీకరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అక్కన్నపేట స్టేషన్‌లో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తామని డీఆర్ఎం హామీ ఇచ్చారు. ఆయన వెంట డీసీఎం అనురుధ్, డీఎస్‌వో విజయకుమార్, డీఈఈ విష్ణు చైతన్య, ఇతర అధికారులు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయికి సైన్స్ ప్రదర్శనలు

**విద్యార్థులకు అభినందనలు**

**నర్సాపూర్:** రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పట్టణంలోని శ్రీ విష్ణు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జామి మంగళవారం తెలిపారు. ఇటీవల మెదక్‌లో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో తమ పాఠశాలలో 8వ తరగతి చదివే యశశ్రీ, శ్రీచంద్ర అగ్ని పర్వత విస్ఫోటనం అనే అంశంపై ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకొని రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

**టేక్మాల్(మెదక్):** రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు టేక్మాల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. పాఠశాలలో 10వ, 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీలు ఐశ్వర్య, రేణుక అంతరించిపోతున్న జీవరాశుల రక్షణ అనే అంశంపై ప్రదర్శనను ఏర్పాటు చేసి ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు సైన్స్ టీచర్ ఉమా మహేశ్వరరాజ్‌ను పాఠశాల తరఫున అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బాలమణి ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

## అర్హులే వైద్య సేవలందించాలి

**టీజీఎంసీ మెంబర్ డాక్టర్ రాజ్‌కుమార్**

**చేర్యాల(సిద్దిపేట):** క్వాలిఫైడ్ వైద్యులు మాత్రమే ప్రజలకు వైద్య సేవలందించాలని టీజీఎంసీ మెంబర్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని చేర్యాల పరిధిలో ప్రథమ చికిత్స మాటున పరిమితికి మించి వైద్యం చేస్తున్న నకిలీ ఆర్ఎంపీల క్లినిక్‌లపై మంగళవారం తెలంగాణ వైద్య మండలి సభ్యుడు డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పెద్దమ్మగడ్డ ప్రాంతంలోని రామచంద్రం, చేర్యాల భాస్కర్, మద్దూర్‌లో శ్రీశైలం క్లినిక్, అక్షర ఆస్పత్రులను తనిఖీ నిర్వహిస్తూ అధిక మొత్తంలో యాంటీబయాటిక్ మందులు, స్టెరాయిడ్స్ ప్రజలకు ఇస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలను అతిక్రమించి ప్రజలకు వైద్యం అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరిపై కేసులు నమోదు చేసి త్వరలో కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. అర్హత లేని వారు ప్రాక్టీస్ చేయడం, వైద్యం పేరుతో అధిక డోసు మందులు ఇవ్వడం చట్ట విరుద్ధమన్నారు.



క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారి

## హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన

**సిద్దిపేటఎడ్యుకేషన్:** ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌ఐవీ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆ విభాగాధిపతి డాక్టర్ మదన్‌మోహన్ మాట్లాడుతూ.. ఎయిడ్స్ నివారణ చర్యలు, లైంగిక అంశాలపై విద్యార్థులకు వివరించి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు.

**విద్యార్థులతో ర్యాలీ..**

జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో డిగ్రీ కళాశాల, బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రద్ధానందం, ధరపల్లి నగేశ్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ సునీత, సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు రాణి, పుణ్యమ్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అధ్యాపకులు

## సెల్ టవర్‌ల బ్యాటరీలు చోరీ

**ఆరుగురు నిందితులు అరెస్టు**

**గజ్వేల్‌రూరల్:** సెల్ టవర్‌ల బ్యాటరీలు చోరీకి పాల్పడుతున్న నిందితులను పోలీసులు పట్టుకున్నారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా లాల్‌గాడి మలక్‌పేట్‌కు చెందిన బదావత్ కృష్ణ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని రాడగంబ బస్తీలో నివాసముంటున్నాడు. అతడి కుమారుడు (మైనర్)తోపాటు మంచిర్యాల జిల్లా కిష్టంపేటలోని ఎల్లక్కపేటకు చెందిన సతీష్, నస్పూర్‌లోని ఆర్‌కే 5కాలనీకి చెందిన ఇస్లావత్ రమేశ్, బెల్లంపల్లిలోని రడగంబ బస్తీకి చెందిన లావుడియా శంకర్‌లు పని కోసం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉంటున్నారు. గతంలో సెల్ టవర్‌లకు బ్యాటరీలను ట్రాన్స్‌పోర్ట్ చేయగా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో వీరంతా బృందాలుగా ఏర్పడ్డారు. గజ్వేల్, కుకునూర్‌పల్లి, ములుగు, మనోహరాబాద్, షామీర్‌పేట్, శివ్వంపేట, శంషాబాద్, చేగుంట పోలీస్ స్టేషన్ల పరిధిలో సెల్ టవర్‌ల బ్యాటరీలను చోరీ చేసి మేడ్చల్ జిల్లా కిష్టాపూర్ ప్రాంతానికి చెందిన దుద్దెద లింగం స్క్రాప్ దుకాణంలో విక్రయిస్తున్నారు. సెల్ టవర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు అందుకున్న గజ్వేల్ పోలీసులు టెక్నాలజీ సాయంతో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 98 వేల నగదుతో పాటు 23 బ్యాటరీలు, 4 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. వీరందరినీ 11 కేసుల్లో జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.



బ్యాటరీలు చూపుతున్న పోలీసులు

## పుట్టిన రోజు వేడుకలకు వెళ్లొస్తుండగా..

- డివైడర్, లారీని ఢీకొట్టిన కారు
- వ్యక్తి మృతి, ఇద్దరికి గాయాలు

**జహీరాబాద్ టౌన్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కోహీర్ మండల పరిధిలో గల చింతల్‌ఘాట్ గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్ కుమార్ కథనం మేరకు.. పటాన్‌చెరుకు చెందిన సామ అశోక్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఇద్దరు మిత్రులతో కలిసి కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి కారులో వచ్చాడు. వేడుకల ముగిశాక తిరుగు ప్రయాణంలో పటాన్‌చెరుకు వెళ్తున్నారు. చింతల్‌ఘాట్ గ్రామ పరిధిలో 65 జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని అనంతరం లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



జహీరాబాద్ టౌన్: ప్రమాదంలో దెబ్బతిన్న కారు

**రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి**

**సంగారెడ్డి క్రైమ్:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. నర్సాపూర్ మండలం సీత్యాతండాకు చెందిన ముడతల దేవిసింగ్ (35) మంగళవారం ఉదయం పోతిరెడ్డిపల్లి నుంచి బైక్‌పై సంగారెడ్డికి వస్తున్నాడు. సంగారెడ్డిలోని సీఎస్‌ఐ చర్చ్ ఆవరణలోకి రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**బస్సు ఢీకొని వ్యక్తి..**

**చిన్నశంకరంపేట(మెదక్):** బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండలం వల్లూర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వల్లూర్ గ్రామానికి చెందిన వడ్ల రమేశ్(45) చేగుంటకు వెళ్లి సైకిల్‌పై గ్రామానికి తిరిగొస్తున్నాడు. వల్లూర్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దీన్ తెలిపారు.